www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 5 జూన్ 2023
5
ఏలూరు




భీమడోలు ఎంపిడిఓగా పద్మావతిదేవి



భీమడోలు: భీమడోలు ఎంపిడిఓగా సిహెచ్.పద్మావతిదేవి నియమితులయ్యారు. ఇంతవరకు ఆ స్థానంలో పూర్తి అదనపు బాధ్యతతో కొనసాగిన పద్మావతిదేవిని పూర్తిస్థాయి ఎంపిడిఓగా అదే స్థానంలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పంచాయతీరాజ్ శాఖ ఎఇ డి.సత్యనారాయణ ఏలూరులోని ఎస్ఇ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ స్థానంలో ఇంతవరకూ ఎవరినీ నియమించలేదు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కె.రామారావు పెంటపాడు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆ స్థానం ఖాళీగా ఉంది. పూళ్ల పంచాయతీ జూనియర్ సహాయకులు ఫణిశ్రీ వేల్పూరు గ్రామపంచాయతీకి బదిలీ అయ్యారు. కొప్పాక పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు బదిలీపై భీమడోలు వచ్చారు. అంబరుపేట క్లస్టర్ పరిధిలోని అంబరుపేట, కురెళ్లగూడెం గ్రామ పంచాయతీల కార్యదర్శిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఏరువాక.. సాగేదెప్పుడో..!

- ముందస్తు సాగుపై నీలినీడలు
- 1న కాలువలకు సాగునీరు విడుదల
- జిల్లాకు రోజుకు 500 క్యూసెక్కుల నీరు
- వడగాల్పులతో అననుకూల వాతావరణం
- నారుమడులు వేసేందుకు రైతులు వెనుకంజ
- సాగునీరు విడుదల చేశాక తూడు తొలగింపు పనులపై విమర్శలు



ధవళేశ్వరం ఆనకట్ట

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ ముందస్తు సాగుపై నీలినీడలు కమ్ముకున్నాయి. జూన్ ఒకటిన కాలువలకు సాగునీరు విడుదల చేసినప్పటికీ నారుమడులు వేసేందుకు రైతులు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. దీనికి ప్రధాన కారణం వేసవి తీవ్రత తగ్గకపోవడం, వడగాల్పులతో వాతావరణ పరిస్థితులు ఆందోళనకరంగా ఉండటమేనని చెప్పొచ్చు. జూన్ ఒకటిన సాగునీరు విడుదల చేసి ఖరీఫ్‌లో ముందస్తు సాగు చేపడితే నవంబర్, డిసెంబర్‌ల్లో విరుచుకుపడే తుపాన్ల బారిన పడకుండా పంటను కాపాడుకోవచ్చునని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. అందులో భాగంగానే కొన్నేళ్లుగా జూన్ ఒకటో తేదీన పంట కాలువలకు సాగునీరు విడుదల చేస్తోంది. వాతావరణ పరిస్థితుల రీత్యా ప్రభుత్వ ఆలోచన ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. అందుకు సంబంధించి విత్తనాలు సైతం సిద్ధం చేసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగానే జూన్ ఒకటిన సాగునీరు విడుదల చేశారు. ప్రస్తుతం రోజుకు 500 క్యూసెక్కుల నీటిని కాలువలకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. నారుమడులు ఆరంభిస్తే సాగునీరు విడుదల మరింత పెంచనున్నారు. కనీసంగా జూన్ 20వ తేదీకి నారుమడులు వేయడం పూర్తయితేనే ముందస్తు సాగు ప్రణాళిక విజయవంతమవుతుంది. అయితే వాతావరణ పరిస్థితి అందుకు అనుకూలంగా కన్పించడం లేదు. జూన్ మొదటివారం పూర్తవుతున్నా వేసవి తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. ఇప్పటికీ ప్రతిరోజు 43 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేడిగాలులకు ఇంట్లోంచి బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో నారుమడులు వేసినా దెబ్బతినే ప్రమాదం ఉంది. వర్షాలు పడితే తప్ప రైతులు నారుమడులు వేసే అవకాశం లేదు. నైరుతి రుతుపవనాలు ప్రవేశించి వాతావరణం చల్లబడితే తప్ప ఏరువాకకు రైతులు సిద్ధమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో కాలువలకు సాగునీరు విడుదల చేసినా రైతులు నారుమడుల గురించి ఆలోచించే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ఈ ఏడాది కూడా ఖరీఫ్ సాగు ఆలస్యంగానే ప్రారంభమయ్యే పరిస్థితి కన్పిస్తోంది. అదే జరిగితే ఖరీఫ్‌సాగుతోపాటు రబీ సాగు సైతం ఆలస్యయ్యే పరిస్థితులు ఏర్పడనున్నాయి.

కాలువలకు నీరు విడుదలయ్యాక తూడు పనులేమిటీ


ఈ ఏడాది కూడా ప్రభుత్వం ఆధునికీకరణ పనులకు తిలోదకాలిచ్చేసింది. ఎక్కడా ఒక్క రూపాయి విలువ చేసే ఆధునికీకరణ పనులు చేయలేదు. కాలువలు ఎక్కడికక్కడే మొక్క తేరిపోయాయి. కాలువలన్నీ తూడు, గుర్రపుడెక్కతో పూడుకుపోయాయి. సాగునీరు విడుదల చేసినా కిందకు పారని పరిస్థితి నెలకొంది. తూడు తొలగింపు పనులకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.18 కోట్లు వరకూ మంజూరైనట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ పనులు ప్రారంభించకుండా కాలువలకు సాగునీరు విడుదల చేశాక తూడు తొలగింపు పనులు ప్రారంభించారు. కాలువల్లో నీరు ఉన్నప్పుడు చేసే పనుల్లో నాణ్యత ఉండదని రైతులు చెబుతున్నారు. కాలువల్లో నీరు తక్కువగా ఉన్నప్పుడు తూడు, గుర్రపు డెక్క, కర్రనాచు వంటివి వేరులతో సహా తీయడానికి వీలుంటుందని చెబుతున్నారు. అదే కాలువల్లో నిండుగా నీరుంటే పైపై మమ అనిపించే రీతిలో తూడు తొలగింపులు జరిపేస్తారని విమర్శలు విన్పిస్తున్నాయి. తూడు తొలగింపు పేరుతో రూ.కోట్లు ఖర్చు చేసినా రైతులకు పెద్దగా ప్రయోజనం లేకుండా పోతుందని వాపోతున్నారు. తూడు తొలగింపు పనులు ఎప్పటికి పూర్తవుతాయో వేచిచూడాలి.

పెరిగిన వడగాల్పులు.. జనం విలవిల..!

వడదెబ్బతో ఆసుపత్రులకు వృద్ధులు క్యూ - జాగ్రత్తలు తప్పనిసరంటున్న వైద్యులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

రోహిణికార్తె ప్రభావంతో పెరిగిన ఉష్ణోగ్రతలు, వడగాల్పులు, ఉక్కపోతలతో వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తీవ్రరూపం దాల్చిన ఎండలతో మండల ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఎండల తీవ్రతకు ప్రజలు ఇళ్లలో ఉండలేక, బయటకు రాలేక సతమతమవుతున్నారు. ఎసి గదుల నుంచి జనం బయటకు రాలేని పరిస్థితి ఉంది. ఉక్కపోత, వడగాల్పులకు వృద్ధులు, చిన్నారులు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు.



వెలవెలబోతున్న సినిమా థియేటర్

ఆసుపత్రులు కిటకిట

నెలరోజులు మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పదుల సంఖ్యలో ప్రజలు వడదెబ్బకు గురయ్యారు. ముఖ్యంగా వీరిలో వృద్ధులు పెద్దసంఖ్యలో ఉన్నారు. తర్వాత స్థానంలో చిన్నారులు ఉన్నారు. వడదెబ్బకు గురైన బాధితులు ముదినేపల్లిలోని వివిధ ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరికొందరు ఆయా గ్రామాల్లో స్థానికంగా ఉన్న ఆర్ఎంపి, పిఎంపిలను ఆశ్రయిస్తూ చికిత్స పొందుతున్నారు. ముదినేపల్లిలో రోజుకు పది మంది వరకు వడదెబ్బకు గురై ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నట్లు అంచనా.

పది గంటలకే హోటళ్లు బంద్

ఎండతీవ్రతకు ఆదివారం ఉదయం పది గంటలకే హోటళ్లన్నీ బంద్ అయ్యాయి. ఎండలు మండిపోవడంతో చిరువ్యాపారులు పది గంటల్లోపే తమ అమ్మకాలు ఆపేస్తున్నారు. పది గంటలు తర్వాత ముదినేపల్లి సెంటర్‌లో అల్పాహారం దొరకడం లేదు. దీంతో దూరం ప్రాంత ప్రయాణాలు చేసేవారు ఇబ్బందులు పడ్డారు. వ్యాపార సంస్థలు సైతం 12 గంటలకు మూసేసి సాయంత్రం ఐదు గంటల తర్వాత తెరుస్తున్నారు.

ఉదయం ఆటలు రద్దు

రోహిణి కార్తె ప్రభావంతో ఎండలు మండిపోవడంతో జనం రోడ్డెక్కే పరిస్థితి లేదు. దీంతో సినిమాలకు వచ్చే వారిసంఖ్య బాగా తగ్గిపోయింది. దీంతో సాయంత్రం 6-15 గంటలు, రాత్రి 9-15 గంటల ఆటలు మాత్రమే ప్రదర్శిస్తున్నారు.

తగ్గిన పాల దిగుబడి

వడగాల్పులతో పశువుల్లో పాల దిగుబడులు బాగా తగ్గాయి. ఎండలకు పశువులు మేత సరిగా తీసుకోకపోవడంతో పాల దిగుబడులు బాగా తగ్గినట్లు పాడి రైతులు చెబుతున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు తోలుకెళ్లి పది గంటల్లోపే పశువులను ఇళ్లకు తోలుకు వస్తున్నారు. సాయంత్రం 4 గంటలు తర్వాత మళ్లీ మేతకు వదులుతున్నారు. దీంతో మేత సమయం తక్కువగా ఉండడంతో పాల దిగుబడి తగ్గుతున్నట్లు చెబుతున్నారు. మధ్యాహ్న సమయాల్లో ఊరచెరువుల్లో ఉంచి పశువులను కాపాడుకుంటున్నారు. పశువుల పాకల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఏదేమైనా మండే ఎండలతో ప్రజలు, పశుపక్ష్యాదులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

వడదెబ్బకు గురైతే ఇలా చేయండి

వడదెబ్బకు గురైన వ్యక్తి శరీరానికి విపరీతమైన చెమటలు పడతాయి. వాంతులు, విరోచనాల లక్షణాలతోపాటు బాగా నీరస పడిపోయి అపస్మారక స్థితికి చేరతారు. గుండె వేగంగా కొట్టుకుంటుంది. వడదెబ్బకు గురైన వ్యక్తికి చల్లని నీటితో స్నానం చేయించాలి. తడి గుడ్డతో తరచూ శరీరం తుడుస్తూ ఉండాలని ప్రముఖ వైద్యులు మనోజ్ తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయరాదని, ఎండలో వెళ్లేవారు తప్పక చెవులకు రుమాలు కట్టుకొని, తలకు టోపీ, కళ్లజోడు ధరించాలని సూచించారు. ఇళ్లవద్ద ఉన్న వారు మజ్జిగలో ఉప్పు, పంచదార కలుపుకుని తరచూ తాగాలన్నారు. తడి తుండు ఎప్పుడూ వీపు పైనే ఉంచుకోవాలని, కొబ్బరినీళ్లు, తాటిముంజులు, చెరకురసం, మజ్జిగ తరచు తాగాలని పేర్కొన్నారు.




మౌనం పాటిస్తూ సంతాపం తెలుపుతున్న విద్యార్థులు

రైలు ప్రమాద మృతులకు చిన్నారుల నివాళి

ప్రజాశక్తి - భీమడోలు

ఒడిశ్శాలో చోటు చేసుకున్న రైలు ప్రమాద మృతులకు సంతాపం తెలుపుతూ భీమడోలు శాఖా గ్రంథాలయంలో చిన్నారులు ఆదివారం నివాళులర్పించారు. వేసవి విజ్ఞాన తరగతులకు హాజరైన చిన్నారులు, విద్యార్థులకు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వెంకట ఉమామహేశ్వరరావు, గ్రంథపాలకులు కె.శ్రీనివాసరావు రైలు ప్రమాద సంఘటనపై వివరించారు. ప్రభుత్వం రైలు ప్రమాద మృతుల కుటుంబాలను మరింతగా ఆదుకోవాలని, మానవతావాదులు వివిధ రూపాల్లో క్షతగాత్రులను ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు. అనంతరం కొనసాగిన వేసవి విజ్ఞాన తరగతుల్లో పలు అంశాల గురించి వారు ఇరువురు విద్యార్థులకు వివరించారు.



పాటలు ఆలపిస్తున్న గాయకులు

ఉత్సాహభరితంగా ఎస్‌పి.బాలు స్వర నీరాజనం

ప్రజాశక్తి - ఏలూరు

ఘంటసాల సంగీత కళాశాల, జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గాన గంధర్వుడు ఎస్‌పి.బాల సుబ్రహ్మణ్యం 78వ జయంతి సందర్భంగా స్వర నీరాజనం కార్యక్రమాన్ని స్థానిక వైఎంహెచ్ఎ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ పెంచల కిషోర్ మాట్లాడుతూ నేపథ్య గాయకుడిగా, సంగీత దర్శకుడిగా, నటుడిగా, గాత్రధాన కళాకారుడిగా, టెలివిజన్ వ్యాఖ్యాతగా అన్ని రంగాల్లోనూ బలమైన ముద్రవేసిన బాలు బహుముఖ ప్రజ్ఞాశాలి అని అన్నారు. మాజీ శాసన సభ్యులు రాము సూర్యారావు మాట్లాడుతూ భారతీయ చలనచిత్ర రంగంలో బహు భాషల్లో వేలాది పాటలు పాడి సంగీతాభిమానుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న బాలుకు భారత ప్రభుత్వం భారత రత్న అవార్డును ఇచ్చి గౌరవించాలన్నారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాడుతా తీయగా, స్వరాభిషేకం వంటి కార్యక్రమాలతో కళా రంగానికి వేలాదిమంది గాయకులను అందించిన ఘనత పద్మభూషణ్ ఎస్‌పి బాలుకు మాత్రమే దక్కుతుందన్నారు. సినిమా పాటల్లోనే కాకుండా తెలుగు భాషలో కూడా అపస్వరాలను, శబ్దరాక్షసాలను సరిచేసి మంచి బాటలు వేసిన తెలుగు భాషా ప్రేమికుడు బాలు అని కీర్తించారు. బాలు స్వర నీరాజనం కార్యక్రమాన్ని నంది అవార్డు గ్రహీత మహ్మద్ ఖాజావలి వ్యాఖ్యానం చేశారు. ఈ స్వరాభిషేకంలో గాయకులు లంకా వెంకటేశ్వర్లు, అర్జునరావు, బిహెచ్‌పి.పుష్పరాజు, రాజేష్ మీనన్, పి.సూర్య ప్రకాష్‌రావు, వై.యజ్ఞప్రసాద్‌తో పాటు గాయనీ మణులు మోహనలక్ష్మి, శ్రావణి, హర్షిత, నాగలక్ష్మి, బాలత్రిపుర సుందరి తదితరులు తమ గానంతో అద్భుతమైన స్వరార్చన చేశారు. గాయకులకు కీ బోర్డ్ రంభా కిషోర్, ఎలక్ట్రిక్ ప్యాడ్స్ రాజేష్, తబలా కళ్యాణ్ వాయిద్య సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో ఖాసీం, లేళ్ల వెంకటేశ్వరావు, వేమా కోటేశ్వరరావు, నాగాస్త్రి, దేవరకొండ వెంకటేశ్వర్లు, దువ్వి రామారావు, గరికిపాటి కాళిదాసు, వై.ఆనందనాయుడు, కస్తూరీరావు, గంగా భవాని, దువ్వి రామారావు, గురుశర్మ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: ప్రముఖ గాయకులు, కీర్తిశేషులు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా ఆదివారం నూజివీడు కళావేదిక ఆధ్వర్యంలో స్వరార్చన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. నూజివీడు బ్యాంక్ స్టేట్ సమీపంలో స్థానిక సిద్ధార్థ కాలేజీలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పురాణం కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ సంగీత ప్రేమికులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేశారన్నారు.

ఈదురుగాలులు.. వర్షం

ప్రజాశక్తి - ముసునూరు

ఆదివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారి అకాల వర్షం కురవడంతోపాటు బలమైన ఈదురు గాలులు వీయడంతో జనం బెంబేలెత్తారు. మండల కేంద్రమైన ముసునూరులో విద్యుత్ స్తంభాలతోపాటు భారీ వృక్షాలు కూలిపోయి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. ఇళ్లపై ఉన్న రేకులు ఎగిరి పడ్డాయి. దీంతో జనం కొద్దిసేపు బిక్కుబిక్కుమంటూ గడిపారు. వర్షం వల్ల వాతావరణం చల్లబడినా ఈదురుగాలుల ప్రభావానికి జనం బెంబేలెత్తారు.



ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్టు

ట్రాన్స్‌కో ఇఇగా సత్యనారాయణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఎపిఇపిడిసిఎల్ నూజివీడు ఇఇగా ఎ.సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ పని చేసిన ఇఇ డి.కృష్ణనాయక్ ఉయ్యూరు డివిజన్‌కు బదిలీ అయ్యారు. దీంతో ఒంగోలులో పనిచేస్తున్న సత్యనారాయణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో విద్యుత్ సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. విద్యుత్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.



సిఎం పోలవరం పర్యటనకు పటిష్ట బందోబస్తు : జెసి

ప్రజాశక్తి - పోలవరం



సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి లావణ్యవేణి

పోలవరంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ నెల ఆరో తేదీన పోలవరం ప్రాజెక్ట్ పనుల పరిశీలనకు ముఖ్యమంత్రి విచ్చేస్తున్న దృష్ట్యా ఆయన పర్యటించే ప్రాంతాల్లో ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆదివారం జెసి పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి లావణ్యవేణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఆరో తేదీ ఉదయం 10.20 నిముషాలకు ముఖ్యమంత్రి హెలీకాప్టర్‌లో పోలవరం ప్రాజెక్ట్ సైట్‌కు చేరుకుంటారని, ప్రజాప్రతినిధులను కలుసుకున్న అనంతరం, ఎగువ కాపర్ డ్యామ్, దిగువ కాపర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్, ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యామ్‌లో పనులను పరిశీలిస్తారన్నారు. అనంతరం ప్రాజెక్ట్ సైట్‌లోని సమావేశపు హాలుకు చేరుకుని అధికారులు, ఇంజినీర్లతో ముఖ్యమంత్రి సమీక్షిస్తారన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణ పనుల ప్రగతికి సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని జలవనరుల శాఖ అధికారులను జెసి ఆదేశించారు. వేసవి దృష్ట్యా ఆయా ప్రదేశాల్లో టెంట్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి, అసిస్టెంట్ కలెక్టర్లు అపూర్వ భరత్, శ్రీపూజ, ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్ సుధాకర్‌బాబు, ఆర్‌డిఒలు కె.పెంచల్‌కిషోర్, ఝాన్సీరాణి, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్, తహశీల్దార్ సుమతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకూ పోరు

రాష్ట్ర జాతాలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు



భీమవరంలో మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకూ ఆందోళన ఆపేది లేదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. ఇచ్ఛాపురంలో ప్రారంభమైన యాత్ర ఆదివారం జిల్లాలో ప్రవేశించి తణుకు, నరసాపురం, పాలకొల్లు మీదుగా సాయంత్రానికి భీమవరం చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ కాలనీలో నిర్వహించిన సభలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న పనులు మరెవరు చేయలేరని, ఆ విషయం ప్రభుత్వానికీ తెలుసని, అయినప్పటికీ మున్సిపల్ కార్మికుల శ్రమను గుర్తించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. జగన్ పాదయాత్ర సందర్భంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే పరిష్కారం చేస్తానని చెప్పారని గుర్తు చేశారు. కనీస వేతనాలు, సబ్బులు, నూనెలు, చెప్పులు, యూనిఫామ్ వంటి సౌకర్యాలు కూడా కల్పించడం లేదని విమర్శించారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను పోరాటాల ద్వారా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇంత జరుగుతున్నా రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలుగా ఉన్న తెలుగుదేశం, జనసేన తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఓట్లు, సీట్లు లెక్కలు తప్ప ప్రజలు పడుతున్న బాధలను పట్టించుకోవట్లేదన్నారు. కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు శిరీస్ కుమార్ అధ్యక్షత వహించగా టి.నూకరాజు, ధనాల వెంకటరావు, జి.లక్ష్మి, జి.నాయుడు, వరలక్ష్మి, బి.సోమయ్యతోపాటు జిల్లా నాయకులు కర్రి నాగేశ్వరరావు, కె.రాజారామ్మోహన్‌రాయ్, స్థానిక మున్సిపల్ వర్కర్స్ నాయకులు నీలాపు రాజు, అప్పన్న నాగేశ్వరరావు, పెద్దిరాజు పాల్గొన్నారు.

తణుకు రూరల్: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ రాష్ట్ర ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల రాష్ట్ర ప్రచార జాత ఆదివారం ఐదో రోజు పశ్చిమగోదావరి జిల్లాలోకి తణుకు వద్ద ప్రవేశించింది. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులను, ప్రజలను ఉద్దేశించి ఉమామహేశ్వరరావు మాట్లాడారు. జగన్ ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా రాష్ట్రంలోని కాంట్రాక్ట్ కార్మికులను, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని, వారి సమస్యలను పరిష్కరిస్తానని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. జగన్ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా ఏఒక్క వాగ్దానమూ అమలు చేయలేదని విమర్శించారు. పట్టణాల్లో పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచకుండా కార్మికులపై పని భారాన్ని పెంచుతున్నారని అన్నారు. జీతాలు, అలవెన్సులు, పనిముట్లు సకాలంలో ఇవ్వకుండా కార్మికులను బానిసలుగా రాష్ట్ర ప్రభుత్వం పని చేయించుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఈ జాతా నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో కార్మికులు పెద్దఎత్తున ఉద్యమిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు బి.సోమయ్య, ధనాల వెంకట్రావు, పి.నూకరాజు, ఎం.వరలక్ష్మి, జి.పోలమ్మ, సిఐటియు జిల్లా నాయకులు పివి.ప్రతాప్, కామన మునిస్వామి, నీలాపు ఆదినారాయణ బాబు, మజ్జి కృష్ణబాబు, పి.నవీన్, కోతపూడి శ్రీను, పుష్ప, కొత్తపల్లి అయ్యప్ప పాల్గొన్నారు.



తణుకులో

నరసాపురం టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన రాష్ట్ర ప్రచార జాతా ఆదివారం నరసాపురం చేరుకుంది. పట్టణంలో 29వ వార్డులో మున్సిపల్ వర్కర్స్ నివాస ప్రాంతాల్లో సభ జరిగింది. సభకు సిఐటియు పట్టణాధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు అధ్యక్షత వహించగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడారు. కరోనా కష్టకాలంలో ఫ్రంట్‌లైన్ వారియర్స్ గా ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేసిన మున్సిపల్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందని విమర్శించారు. వీరికి 010 పద్దు ద్వారా జీతాల చెల్లింపు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడగా జిల్లా నాయకులు ధనాల వెంకటేశ్వరరావు, బంగారు లక్ష్మి, కె.నాయుడు, బంగారు వరలక్ష్మి, సిఐటియు నాయకులు వంగ సాగర్, నోముల కొండ, పొగాకు నారాయణరావు, పొన్నాడ మల్లేష్, జగన్ పాల్గొన్నారు.



నరసాపురంలో..

పాలకొల్లు: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ సిబ్బందికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, వారికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలతోపాటు సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు, స్కూల్ స్వీపర్స్ యూనియన్ నాయకులు అంజలి పాల్గొన్నారు.



పాలకొల్లులో..

పడకేసిన గోదాముల నిర్మాణం..!

పునాదులు కూడా పడని దుస్థితి - పలుచోట్ల భూసేకరణ పూర్తిచేసినా ప్రారంభం కాని పనులు - నిధుల లేమే కారణం


ప్రజాశక్తి - ముసునూరు

మండలంలో వ్యవసాయ సహకార సొసైటీ గోదాముల నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారయ్యాయి. మండలవ్యాప్తంగా ఉన్న ఏడు కో-ఆపరేటివ్ సొసైటీల పరిధిలో పది వ్యవసాయ గోదాముల నిర్మాణాలకు ఒక్కో సొసైటీకి నాబార్డు నిధులు రూ.70 లక్షల నుండి రూ.80 లక్షల వరకూ మంజూరైనట్లు గతంలో సంబధిత అధికారులు తెలిపారు. ఈ నిధులను 90 శాతం సబ్సిడీగా పది శాతం నిధులు సొసైటీ భరించే విధంగా నాబార్డు పేర్కొంది. అయితే రెవెన్యూ అధికారులు గోదాముల నిర్మాణాలకు పలుచోట్ల 50 సెంట్ల భూ సేకరణ కూడా దాదాపు పూర్తిచేశారు. కానీ ఆ భూమి ఏమైందో, ఆ నిధులు ఏమయ్యాయో కూడా అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకూ శంకుస్థాపన చేసిన దాఖలాలు కూడా ఎక్కడా లేవు. దీంతో రైతులు తమ ధాన్యం కాపాడుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటను కోల్పోయి తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. రబీ, ఖరీఫ్ తేడా లేకుండా ప్రతిపంటలోనూ రైతులు ఏదోరూపంలో నష్టాలపాలవుతూనే ఉన్నారు. సకాలంలో గోదాములు నిర్మించి రైతులకు అందుబాటులోకి తెచ్చిఉంటే ఈ నష్టాలు, కష్టాలు ఉండేవి కావని వారు వాపోతున్నారు. మండలంలో ఎక్కువగా వరి, మొక్కజొన్న, మినుము, పొగాకు, మిర్చి వంటి పంటలు ఎక్కువగా సాగుచేస్తుంటారు. మాసూళ్లు పూర్తయిన తర్వాత పంట అమ్ముకునేందుకు సరైన గిట్టుబాటు ధర రాని సందర్భంలో రైతులు ఈ గోదాముల్లో నిల్వ చేసుకుని, అనంతరం గిట్టుబాటు ధర వచ్చిన సందర్భంలో విక్రయించుకునేందుకు ఈ గోదాములు ఎంతగానో ఉపయోగపడతాయి. కానీ నేడు ఆ పరిస్థితి లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ముసునూరు కో - ఆపరేటీవ్ సొసైటీ భవనం

సొసైటీలే ముందు పెట్టుబడి పెట్టాలి

ఈ గోదాముల నిర్మాణాలకు ముందుగా ఆయా సహకార సొసైటీలు పెట్టుబడిపెట్టి నిర్మాణం చేపడితే ఆ తర్వాత వాయిదాల పద్ధతిలో సొసైటీలకు నాబార్డు నిధులు ఇస్తామని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారని కార్యదర్శులు చెబుతున్నారు. అయితే మండలంలో ఉన్న కొన్ని సొసైటీలు అరకోర నిధులతో నెట్టుకొస్తున్న పరిస్థితులున్నాయి. అలాంటి సొసైటీలు గోదాముల నిర్మాణాలకు ఆ నగదు వాడితే, నాబార్డు నిధులు వాయిదాల పద్ధతిలో వచ్చేలోపు, సొసైటీల నిర్వహణ ఇబ్బంది అవుతుందని కార్యదర్శులు చెబుతున్నారు. గోదాముల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలంటూ రైతులు, రైతు సంఘాలు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు తరచూ అందిస్తూనే ఉన్నారు. వ్యవసాయ గోదాములకు ఇచ్చిన నిధులను కుడా ప్రభుత్వం దారి మళ్లించిందనే అనుమానం రైతులు వ్యక్తంచేస్తున్నారు. నాబార్డు సబ్సిడీ నిధులను సొసైటీలకు ఇచ్చి, గోదాముల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా సంబధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.


కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్న శ్రీరాములు

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని శ్రీరామవరంలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని గ్రామానికి చెందిన కార్తీక్ శ్రీరాములు ఆదివారం ప్రారంభించారు. ఈ శిక్షణ కేంద్రంలో మహిళలకు మూడు నెలల పాటు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకూ బుట్టాయగూడెం, కామవరపుకోట, మక్కినవారిగూడెం, బుట్టాయగూడెం గ్రామాల్లో కుట్టు శిక్షణ కేంద్రాలు నిర్వహించామని, జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో మహిళలకు ఈ కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని తపన ఫౌండేషన్ ప్రతినిధి శివ గణేష్ తెలిపారు. మహిళల స్వయం ఉపాధికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

పాత్రికేయుని కుటుంబంపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చాట్రాయి

భూ వివాదంలో మండలానికి చెందిన పాత్రికేయునిపై, అతని కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి తగిన చర్యలు తీసుకోవాలని జెడిఆర్ ఉపాధ్యక్షులు డి.పుల్లారావు, ఎపిడబ్ల్యుజెఎఫ్ నూజివీడు నియోజకవర్గ నాయకులు అబ్బాస్, జబీర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్వతాపురానికి చెందిన చెందిన పాత్రికేయుడు కల్లేపల్లి రాజేష్ తండ్రి వెంకటేశ్వరరావుకు సంబంధించిన భూమిని ఆక్రమించేందుకు సరిహద్దు రైతులు ప్రయత్నించడం సరికాదన్నారు. భూమికి రక్షణగా ఉన్నతాధికారుల సూచన మేరకు సరిహద్దు రాళ్లు పాతి, చుట్టూ ఫెన్సింగ్ వేసుకున్నారనే అక్కసుతో సరిహద్దు రైతులు రాజేష్‌ను, తండ్రి వెంకటేశ్వరరావుపై తీవ్రంగా దాడి చేయడం అన్యాయమన్నారు.


శరవేగంగా జరుగుతున్న పైపులైను పనులు

శరవేగంగా తాగునీటి పైపులైను పనులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు మండలంలోని పెయ్యేరు గ్రామ పంచాయతీలో నూతన పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. ఈ పంచాయతీ శివారు బంటుమిల్లి రోడ్డులోని పూర్ణిమ థియేటర్ వద్ద నుంచి అనగాని దానయ్య కాంప్లెక్స్ వరకూ 600 మీటర్ల పొడవున హెచ్‌డి తాగునీటి పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీ ఆర్థిక సంఘం నిధులు రూ.4.70 లక్షలతో ఈ పనులు చేపట్టారు. ఈ పనులను వైసిపి నాయకులు, పెయ్యేరు గ్రామ ప్రముఖులు జాస్తి రాజేంద్రప్రసాద్ (చంటి) ఆదివారం పర్యవేక్షించారు. పైప్‌లైన్ నిర్మాణంతో ఎంతోకాలంగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రజల కష్టాలు త్వరలో తీరనున్నాయి.

ధాన్యం క్వింటాల్‌కు రూ.3500 మద్దతు ధర కల్పించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ధాన్యం క్వింటాల్‌కు రూ.3500 మద్దతు ధర కల్పించాలని కౌలు రైతు సంఘం జిల్లా మహాసభ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి దంతా కృష్ణ మాట్లాడుతూ వరికి మద్దతు ధర కల్పించాలని, పామాయిల్ పంటకు టన్నుకు రూ.20 వేలు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లకు మద్దతు తెలిపారు. రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్వాసితులకు ఎకరాకు రూ.40 లక్షల నష్టపరిహారం ఇచ్చి సర్వీస్ రోడ్లు వేయాలన్నారు. అనంతరం 11 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులుగా గన్ను వెంకటరావు, ఉపాధ్యక్షులుగా గుంటుముక్కల సతీష్, ప్రధాన కార్యదర్శిగా దొంత కృష్ణ, సహాయ కార్యదర్శిగా నాగేంద్రరావు, కోశాధికారిగా రావెళ్ల రాజేశ్వరరావు ఎన్నికయ్యారు.


వేసవి విజ్ఞాన శిబిరానికి హాజరైన విద్యార్థులు

వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథ పాలకులు ఆర్.కిషోర్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాన్నారు. ఫలితంగా విజ్ఞానం పెరుగుతుందన్నారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకుని సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

టిడిపి అధికారంలోకి రాగానే అన్నదాత పథకంలో రైతులకు రూ.20 వేలు ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించిన నేపథ్యంలో స్థానిక నెహ్రూ బొమ్మ కూడలిలో రైతులతో కలిసి పార్టీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు చంద్రబాబు చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. అనంతరం అరుంధతి కాలనీ యువతకు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి సహకారంతో బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో యువతకు క్రికెట్ కిట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యంద్రప్రగడ శ్రీనివాసరావు, బొడ్డు కృష్ణ, గద్దె అబ్బులు, సున్నం నాగేశ్వరరావు, ఆలపాటి ఫణికిషోర్, కుందుల శ్రీను, మడకం రామకృష్ణ, గన్నిన సూర్యచంద్రరావు, తూంపాడు దుర్గారావు, పసుమర్తి భీమేశ్వరరావు, గుబ్బా రాంబాబు, ఆకుల రాజా, మాటూరు ముసలయ్య, మానికల శీను, సుంకర వెంకట్రావు, పండు, సుధాకర్, మనోజ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం చంద్రబాబు చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టిడిపి ప్రవేశపెట్టిన పథకాలకు తిరోధకాలిచ్చి రైతులకు అందుతున్న పథకాల్లో జగన్ ప్రభుత్వం భారీగా కోతలు విధించిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉంగుటూరు : టిడిపి అధికారంలోకి వస్తే 'అన్నదాత' పథకం ద్వారా ప్రతీరైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇచ్చేలా మహానాడులో ప్రకటించడం గొప్పపరిణామమని ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ, టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. ఆదివారం గొల్లగూడెంలో నందమూరి తారకరామారావు విగ్రహం వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చంద్రబాబు ప్రకటించిన అన్నదాత పథకం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పరిస్థితి విషమించి వార్డు సభ్యురాలి భర్త మృతి

సర్పంచి వేధింపులే కారణమని భార్య ఆరోపణ - సర్పంచితో సహా 11 మందిపై కేసు

ప్రజాశక్తి - చాట్రాయి

ఇటీవల సోమవారం గ్రామంలో మనస్తాపానికి గురై పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వైసిపి ఐదోవార్డు సభ్యురాలి భర్త శ్రీనివాసరావు పరిస్థితి విషమించి శనివారం అర్ధరాత్రి మృతిచెందారు. సర్పంచి కక్షసాధింపు చర్యలకు పాల్పడటం వల్లే మనస్తాపానికి గురై తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆమె కన్నీరుమున్నీరుగా విలపిస్తుంది. ఈ ఘటనకు సంబంధించి పుష్పావతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఐదోవార్డు సభ్యులు కలవల పుష్పావతి ఇటీవల తన వార్డు సభ్యత్వానికి రాజీనామా చేశారు. అయితే గ్రామసర్పంచి ఉప్పల సోమేశ్వరరావుకు పుష్పావతికి మధ్య గతం నుంచి విభేదాలున్నాయి. ఈ క్రమంలోనే ఆమె తన వార్డు సభ్యత్వానికి రాజీనామా చేశారు. అప్పటినుంచి సర్పంచి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పుష్పవతి భర్త కలవల శ్రీనివాసరావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సర్పంచిపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఈ విషయమై గ్రామంలో పెద్దల సమక్షంలో సమస్యను పరిష్కరించుకుంటామని సర్పంచి పోలీసులకు చెప్పి పంచాయతీ నిర్వహించారు. ఈ పెద్దల పంచాయతీలో కలవల శ్రీనివాసరావుకు రూ.లక్ష జరిమానా విధించి వెంటనే డబ్బు కట్టాలని ఒత్తిడి చేశారు. దీంతో మనస్తాపానికి గురై ఈనెల రెండో తేదీన శ్రీనివాసరావు పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే బంధువులు గమనించి చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందారు. భార్య పుష్పావతి ఫిర్యాదు మేరకు నూజివీడు సిఐ అంకబాబు గ్రామ సర్పంచి సోమేశ్వరరావుపై, మరో 11 మందిపై కేసు నమోదు చేశారు.


మృతిచెందిన శ్రీనివాసరావు

చింతలపూడి ట్రాన్స్‌కో ఎడి బదిలీ

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి విద్యుత్ శాఖ ఎడి రాధాకృష్ణ ఉద్యోగోన్నతి పొందారు. ఆయన రాజమండ్రి సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బదిలీపై వెళ్లారు. సుమారు నాలుగున్నర సంవత్సరాలు చింతలపూడి మండలంలో పనిచేశారు. చింతలపూడి, రాఘవాపురం ఎఇగా పనిచేశారు. సిబ్బంది కోరత ఉన్నప్పటికీ సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు.

టి.నరసాపురం ఎంపిడిఒగా మంగకుమారి

ప్రజాశక్తి - టి.నరసాపురం



టి.నరసాపురం ఎంపిడిఒగా బిఎస్ఎల్.మంగకుమారి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన ఎన్‌టి.స్వామి దెందులూరు మండలానికి బదిలీపై వెళ్లారు. పాలకొల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎఒగా బాధ్యతలు నిర్వహిస్తున్న మంగకుమారి ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

వాలీబాల్ కిట్లు అందజేత

పోలవరం: పాతపోలవరం, పల్లిలపేట, బెస్తావీధి యువకులకు పోలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి సహకారంతో కన్వీనర్ బొరగం శ్రీనివాస్ సౌజన్యంతో వాలీ బాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ మంగిన వెంకటరమణ (కొండ) మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడల్లో రాణించాలని సూచించారు. రాబోయే రోజుల్లో కూడా తమవంతుగా యువత క్రీడారంగంలో రాణించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంగిన వెంకటరమణ, మైనార్టీ విభాగ నాయకులు రబ్బాని, ఐటిడిపి ఏలూరు పార్లమెంటు అధికార ప్రతినిధి జల్లేపల్లి శేష వెంకట జితేంద్ర పాల్గొన్నారు.



వాలీబాల్ కిట్లు అందిస్తున్న వెంకటరమణ

ఉత్సాహంగా ఏరువాక పున్నమి వేడుకలు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని యండపల్లి, రేచర్ల గ్రామాల్లో ఏరువాక పున్నమి వేడుకలను జెడి ఫౌండేషన్, అబ్దుల్‌కలాం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలికి పసుపు, కుంకుమతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు మరికంటి గోపాలకృష్ణ మాట్లాడుతూ తొలకరి జల్లుల ఆగమనంతో రైతులు ఆనందోత్సాహాల మధ్య అరక దున్నడంతో పొలం పనులు మొదలుపెడతారని, ఏరు అంటే దున్నడానికి సిద్ధం చేసిన నాగలి అని, ఏరువాక అంటే దున్నడానికి ప్రారంభమని అర్థమని చెప్పారు. రైతులు దేశీయ వరి విత్తనాలతో ఎరువులు, పురుగు మందులు లేని ఆహార ఉత్పత్తులు పండించాలని సూచించారు. ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేయాలన్నారు. ఈ సందర్భంగా రైతులను సన్మానించి వస్త్రాలు బహూకరించారు. స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో జెడి ఫౌండేషన్ ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రీహరి, కుమారస్వామి, రవి, రైతులు పాల్గొన్నారు.


ఏరువాక వేడుక నిర్వహిస్తున్న రైతులు, నాయకులు

108 సిబ్బంది సేవలు భేష్..

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు 108 వాహన సిబ్బంది నిజాయతీని పలువురు ప్రశంసిస్తున్నారు. వివరాల్లోకెళ్తే కడపకు చెందిన లారీ డ్రైవర్ మార్తల గురివిరెడ్డి (45) లోడుతో రాజమండ్రి వెళ్తున్నారు. సదరు లారీ భీమడోలు షుగర్ ఫ్యాక్టరీ వద్ద 216 నూతన జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో స్పృహ కోల్పోయిన గురివి రెడ్డి సమాచారం అందుకున్న అక్కడికి చేరిన 108 వాహనం పైలెట్ సుబ్బారావు, సాంకేతిక నిపుణులు సుబ్రమణ్యం చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆయన అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. లారీ డ్రైవర్‌ను చికిత్స కోసం ఏలూరు తరలించే క్రమంలో డ్రైవర్ సామాన్లను 108 వాహనం పైలెట్, సాంకేతిక నిపుణులు భద్రపరిచే ప్రయత్నం చేశారు. లారీ రికార్డులు, సాంసంగ్ సెల్‌ఫోనుతోపాటు పలు ఇతర పత్రాలు, రూ.40,810 నగదు గుర్తించారు. వీటిని వారు హైవే పోలీసులకు అప్పగించారు. మృతుని సామగ్రి, నగదును నిజాయితీగా పోలీసులకు అందజేసిన 108 వాహనం పైలెట్, సాంకేతిక నిపుణులను పలువురు అభినందించారు.


మృతిచెందిన లారీ డ్రైవర్ వద్ద దొరికిన నగదు, ఇతర రికార్డులను పోలీసులకు అప్పగిస్తున్న108 సిబ్బంది

ముగిసిన బలుసులమ్మ సంబరాలు

ముదినేపల్లి : మండలంలోని శ్రీహరిపురం శివారు ఐనంపూడిలో బలుసులమ్మ ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ప్రతిఏటా బలుసులమ్మ అమ్మవారి సంబరాలు ఏరువాక పౌర్ణమి సందర్భంగా నిర్వహిస్తారు. ఆదివారం గ్రామంలో అమ్మవారి ఊరేగింపు భారీ ఎత్తున జరిగింది. ఉత్సవాలు అఖరిరోజు కావడంతో పెద్దఎత్తున ప్రజలు హాజరై అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

స్వచ్ఛభారత్ మిషన్‌లో భీమడోలు, దుద్దేపూడికి రాష్ట్రస్థాయి గుర్తింపు

ఆయా గ్రామాల్లో 6న కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా వివిధ కార్యక్రమాలు అమలులో జిల్లాతో పాటు, రాష్ట్రస్థాయిలో భీమడోలు, దుద్దేపూడి పంచాయతీలు గుర్తింపు పొందాయని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కెవిఎస్ఆర్.రవికుమార్ తెలిపారు. వీటి పనితీరు పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా స్వచ్ఛ భారత్ మిషన్ సంయుక్త కార్యదర్శి, మిషన్ డైరెక్టర్ జితేంద్ర శ్రీవాస్తవ ఈనెల ఆరో తేదీన ఆయా గ్రామాల్లో పర్యటించనున్నారని ఆయన తెలిపారు. వీరితోపాటు పర్యటనలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, గ్రామీణ నీటి సరఫరా శాఖ చీఫ్ ఇంజనీర్ జె.వెంకట మురళీ పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ మేరకు సన్నాహక చర్యల్లో భాగంగా రవికుమార్ భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు మండలాలకు చెందిన గ్రామపంచాయతీ కార్యదర్శులు, స్వచ్ఛభారత్ మిషన్ అనుబంధ శాఖల అధికారులు, ఇతర సిబ్బందితో సమావేశమయ్యారు. మండలంలో కేంద్రబృందం పర్యటన నేపథ్యంలో ఆయా పంచాయతీలకు చెందిన కార్యదర్శులకు సహకరించేందుకు ఇతర మండలాలకు చెందిన అధికారులను సభ్యులుగా చేరుస్తూ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో 27 బ్లాకులు, 537 గ్రామపంచాయతీలు, 708 గ్రామాల్లో స్వచ్ఛభారత్ కొనసాగుతుందన్నారు. వీటిలో ఇప్పటికే 57 గ్రామాలు బహిరంగ మలవిసర్జన రహిత మోడల్ గ్రామాలుగా ఎంపికయ్యాయన్నారు. 606 గ్రామాలు ప్రత్యేక గుర్తింపు పొందాయన్నారు. 18 గ్రామాల్లో ప్రగతి కొనసాగుతుందని తెలిపారు. ఇదే క్రమంలో ఆయా గ్రామాల్లో 5802 సింగిల్ పిట్, 5954 సెప్టిక్ ట్యాంకులు, 5387 ఇంకుడు గుంతలు, 1505 తిరిగి వాడుకొనే అవకాశం గల సెప్టిక్ ట్యాంకుల నిర్మాణాల వల్ల పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. ఈ క్రమంలో జిల్లాలో నాలుగు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు ఉన్నాయని, వీటిలో ఒకటిగా భీమడోలు గుర్తింపు పొందిందన్నారు. 64 గ్రామాల్లో సుజలం కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కేంద్రబృందం పర్యటించనున్న భీమడోలు గ్రామంలో 7832 మంది జనాభా ఉండగా 4416 గృహాలు, 2062 మరుగుదొడ్లు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో చెత్తనుండి సంపద తయారీ కేంద్రం నిర్వహణ, పర్యావరణ,, పారిశుద్ధ్య పరిరక్షణ ఇతర అంశాల్లో 500 మార్కులకు 372 మార్కులు సాధించి భీమడోలు ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ఇదేవిధంగా మైనర్ గ్రామపంచాయతీ స్థాయిలో 608 జనాభా గల దుద్దేపూడిలో 270 గృహాలున్నాయని, వీటిలో ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్డి ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. కేంద్ర బృందం రానున్న నేపథ్యంలో ఆయా గ్రామ గ్రామపంచాయతీలు తమ గ్రామాలకు గుర్తింపు రావడానికి కారణమైన వివిధ అంశాల గురించి బృందం దష్టికి తేవాలని కోరారు. జిల్లా పంచాయతీ అధికారి ఎవి.విజయలక్ష్మి మాట్లాడుతూ కేంద్రబృందం ఆయా ప్రాంతాల పర్యటనకు రానున్న నేపథ్యంలో ప్లాస్టిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గుడ్డతో తయారుచేసిన ఫ్లెక్సీలు వాడాలని సూచించారు. సిబ్బంది డ్రెస్ కోడ్ పాటించాలని, సెప్టిక్ ట్యాంక్ నోడల్ పిట్ల వద్ద మొక్కలు నాటాలని సూచించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలోని వివిధ పరికరాలు, పనిముట్లు సమర్థవంతంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవడం, బహిరంగ మలవిసర్జన లేని గ్రామాలుగా తీర్చిదిద్దడం, పారిశుధ్య పరిరక్షణ వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఎన్‌వి.సత్యనారాయణ, స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ శిరీష, భీమడోలు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి, డిఎల్‌పిఒ అన్నామణి పాల్గొన్నారు.


వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి

నేరాలు - ఘోరాలు

ఒంటరి మహిళపై అత్యాచారయత్నం

అడ్డుకున్నవారిపై దాడి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని సిద్ధార్థ నగర్‌లో ఒంటరిగా ఉన్న గిరిజన మహిళపై ఆదివారం తెల్లవారుజామున ఇద్దరు వ్యక్తులు అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెల్లవారుజామున ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు గ్రామంలోకి చొరబడి ఒంటరిగా ఉన్న గిరిజన మహిళపై అత్యాచారయాత్నానికి పాల్పడ్డాడు. వెంటనే ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. దీంతో ఆ ఇద్దరు వ్యక్తులు అడ్డు వచ్చిన త్రిమూర్తులు, జరపల ఏసుబాబు, మర్రే రంగమ్మ, గాజుల శేషు, గాజుల మురళీకృష్ణ, మర్రి బుచ్చిబాబుపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. కులం పేరుతో దూషిస్తూ విచక్షణారహితంగా దాడిచేశారని గోపిరాజు తెలిపాడు. రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - కలిదిండి

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం తెల్లవారు జామున స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని రాష్ట్రీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పడమటిపాలెం పంచాయితీ పరిధి బర్రింకలగరువుకు చెందిన యాళ్ల మిల్కీరాజు(50)ను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని 108 వాహనంలో కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పాత ప్లాస్టిక్ డబ్బాలు ఏరుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడు పాత ప్లాస్టిక్ వస్తువులు అమ్ముకుని జీవనం సాగిస్తుంటాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని సోదరుడు యాళ్ల ఆరోగ్య జీవరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మణికుమార్ తెలిపారు.



బీభత్సం సృష్టించిన ఆటో

బ్రేకులు విఫలమై ఆటో బీభత్సం

ప్రజాశక్తి - ముదినేపల్లి

వాటర్ ప్యాకెట్ల లోడుతో వెళ్తున్న ఆటో బ్రేకులు విఫలమై బీభత్సం సృష్టించింది. మూడు వాహనాలను ఢీకొని జనంలోకి దూసుకెళ్లింది. తృటిలో పెను ప్రమాదం తప్పిన ఈ ఘటన ముదినేపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. గుడివాడ నుంచి వాటర్‌ప్యాకెట్ల లోడుతో ఆటో మండలంలోని సింగరాయపాలెం వెళుతుంది. ముదినేపల్లి పోల్‌రాజ్‌కెనాల్ వంతెన వద్దకు రాగానే ఆటో బ్రేకులు విఫలమయ్యాయి. దీంతో ఆటో అదుపు తప్పి స్థానిక గురజ రోడ్డు వద్ద ముందు వెళుతున్న రెండు ఆటోలను, ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి నిలిచిపోయింది. దీంతో బైక్, ఆటోలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అయితే ఈ ఆటో దుకాణాల్లోకి, జనాలపైకి గానీ దూసుకెళితే ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు.

లారీ ఢీకొని గర్భిణి మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

లారీ ఢీకొని గర్భిణి మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని లక్ష్మీపురంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వేలేరుపాడు మండలంలోని కన్నాయిగుట్ట గ్రామానికి చెందిన చీమల కుమారి(25) టి.నరసాపురంలో తన తమ్ముడు నితిన్‌ను ఇంటర్ పరీక్ష రాసేందుకు ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లింది. తిరిగి వస్తుండగా లక్ష్మీపురం వద్దకు రాగానే వీరి వాహనాన్ని లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో కుమారి అక్కడికక్కడే మృతి చెందింది. నితిన్‌కు గాయాలయ్యాయి. ప్రస్తుతం కుమారి నిండు గర్భిణి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.